సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 27 । జనవరి । 2025



చిరునవ్వుల భారతం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

అభివృద్ధే అజెండా



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్





రైల్వే మైదానంలో ఆర్పీఎఫ్ విన్యాసాలు



పాడవోయి భారతీయుడా..





నాటి వీరులు, వీర వనితల వేషధారణలో నేటి పౌరులు



సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు



కొమ్మాది: కాపులుప్పాడకు చెందిన దుంప శ్రీనివాసరెడ్డి తన ద్విచక్ర వాహనానికి భారీ జాతీయ జెండాలను ఏర్పాటు చేసుకుని కాపులుప్పాడ నుంచి భీమిలికి,అక్కడ నుంచి విశాఖ వరకు వెళ్లారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

- జీవీఎంసీ, వీఎంఆర్డీఏ పరిధిలో రూ.1,500 కోట్ల పనులు
- రిపబ్లిక్ డే ప్రసంగంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్
- ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా పరేడ్. అబ్బురపరిచిన శకటాలు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట: ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు.. అందరం సమష్టిగా పనిచేస్తూ జిల్లాలో అభివృద్ధి పతాకం ఎగరేద్దామని కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. స్వాతంత్య్ర సమరయోధులు, పద్మ అవార్డుల గ్రహీతలు, రాజకీయ ప్రముఖులు, న్యాయ, పరిపాలన అధికారులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ముందుగా డీసీపీ మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మైదానాన్ని సందర్శించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ గౌరవ వందనం సమర్పించారు. తర్వాత పరేడ్ కమాండర్ ఎస్.వి.రమణ సారథ్యంలో మార్చ్‌పాస్ట్ నిర్వహించగా.. పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు కవాతు చేశారు. అనంతరం జిల్లా ప్రగతి విశేషాలను వివరిస్తూ కలెక్టర్ అభివృద్ధి నివేదిక చదివారు. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, టూరిజం విభాగాల్లో రూ.1,500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ చేరవేసేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

వందేమాతరం.. అందామా అందరం

ప్రోత్సాహకాల పంపిణీ

వేదికకు సమీపంలో వివిధ రకాల ఉత్పత్తులను, కార్యక్రమాలను, సాధించిన ప్రగతిని వివరిస్తూ వ్యవసాయ, పశుసంవర్థక, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, మత్స్యశాఖ, ఐసీడీఎస్, డ్వామా, ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.39.90 లక్షలతో సమకూర్చిన వివిధ పరికరాలను, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా కేజ్ యూనిట్లు, డస్ట్ బిన్లు, నగదు ప్రోత్సాహక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, న్యాయ, పోలీసు, రెవెన్యూ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, నగర ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. దేశభక్తిని, దేశ సమగ్రతను చాటి చెప్పాయి. నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులచే వందేమాతరం.. అందామా అందరం అనే నృత్య ప్రదర్శనతో ప్రారంభమైన సాంస్కృతిక ప్రదర్శనలు అద్భుతహ అనిపించాయి. పాడుదమా స్వేచ్ఛా గీతం అంటూ ప్రభుత్వ క్వీన్ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, నెత్తురు మరిగితే ఎత్తర జెండా అంటూ తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులు, బాలలం మేం.. బాలలం మేము అంటూ బాల భవన్ పాఠశాల విద్యార్థులు, చక్ దే ఇండియా పేరుతో ఆనందపురం కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, జగతి సిగలో జాబిలమ్మకు వందనం అంటూ క్యాథరిన్ విద్యార్థులు, అనన్య భారతం అంటూ సేక్రెడ్ హార్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు.

వేడుకల్లో అపశ్రుతి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. దేశభక్తి గీతానికి నృత్యం చేస్తూ ఓ విద్యార్థి పోల్‌పైకి ఎక్కి త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పట్టుతప్పి కిందపడిపోయాడు. కింద ఇనుప రాడ్‌కు బలంగా తల ఢీకొట్టడంతో దెబ్బతగిలి బొప్పికట్టింది. అధికారులు వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించారు.



ఎంపీ గొల్ల బాబూరావుతో కలెక్టర్ కరచాలనం





జీవీఎంసీ శకటం

1

జీవీఎంసీ శకటానికి ప్రథమ బహుమతి

వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా తొమ్మిది శకటాలను ప్రదర్శించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విశాఖపై జీవీఎంసీ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై విద్యాశాఖ, ఎస్ఎస్ఏ, దీపం–2 పథకంపై పౌరసరఫరాల శాఖ, నా ఆరోగ్యం– నా హక్కు అనే అంశంపై వైద్యారోగ్య శాఖ, పేదరికం లేని సమాజమే–మన ప్రభుత్వ ఆశయం అనే అంశంపై డీఆర్డీఏ, మహిళా సాధికారతను తెలియజేస్తూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పీఎం సూర్యఘర్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ఈపీడీసీఎల్, ప్రగతికి 10 సూత్రాల స్వర్ణాంధ్ర సాకారం అనే అంశంపై గృహ నిర్మాణ శాఖ, వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యాచరణ అనే అంశాలతో కూడిన శకటాలు ఆకర్షించాయి. జీవీఎంసీ శకటానికి మొదటి బహుమతి రాగా.. డీఆర్డీఏకు ద్వితీయ, వీఎంఆర్డీఏ శకటానికి తృతీయ బహుమతి లభించింది.

446 మందికి ప్రతిభా పురస్కారాలు / 8లో



2 డీఆర్డీఏ శకటం



3 వీఎంఆర్డీఏ శకటం



ప్రత్యేక ఆకర్షణగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శకటం







కలెక్టర్ హరేందిర ప్రసాద్ నుంచి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న జీవీఎంసీ, డీఆర్డీఏ, వీఎంఆర్డీఏ అధికారులు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం
- జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం : ప్రస్తుతం మన రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా.. రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విదేశాల్లో కూడా రెడ్ బుక్ రాజ్యాంగం గురించి చంద్రబాబు, ఆయన తనయుడు చెప్పుకుంటూ ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి అమర్‌నాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల హక్కులను వైఎస్సార్ సీపీ కాపాడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని దావోస్‌కు వెళ్లిన సీఎం చంద్రబాబు పెట్టుబడులు రాకపోయేసరికి మాట మార్చారని విమర్శించారు. దావోస్ పర్యటన ఒక మిథ్య అంటూ మాట్లాడుతున్నారని, పదిసార్లు దావోస్ వెళ్లి వచ్చిన తరువాత ఆ విషయం తెలిసిందా..? అని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. విజయసాయిరెడ్డి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానని స్వయంగా చెప్పారని తెలిపారు. తనలాంటి వారిని వెయ్యి మందిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తయారు చేయగలరని విజయసాయిరెడ్డి పేర్కొన్నారని వివరించారు. అయినప్పటికీ విజయసాయిరెడ్డి పార్టీకి రాజీనామా చేయడం లోటుగానే భావిస్తామన్నారు. గతంలో నలుగురు టీడీపీ రాజ్యసభ సభ్యులు చంద్రబాబు మీద నమ్మకం లేకనే ఆ పార్టీని వీడిపోయారా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, చింతలపూడి వెంకటరామయ్య, జిల్లా పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, పార్టీ ముఖ్య నాయకులు రొంగలి జగన్నాథం, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, పేడాడ రమణకుమారి, నడింపల్లి కృష్ణంరాజు, డా. జహీర్ అహ్మద్, అల్లంపల్లి రాజాబాబు, పార్టీ నాయకులు రామన్న పాత్రుడు, మారుతి ప్రసాద్, బి.పద్మావతి, కె.వి.బాబా, సేనాపతి అప్పారావు, కాళిదాసు రెడ్డి, లక్ష్మి, రాము, అప్పన్న, పి.ప్రేమ, లావణ్య, పల్ల దుర్గ, అప్పలనాయుడు, మరియా దాస్, గణేష్, జగుపల్లి నరేష్, మళ్ల శ్రీదేవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఎగురవేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్టీ నేతలు

ఎస్ఆర్ పురానికి ఉత్తమ పంచాయతీ పురస్కారం



కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ నుంచి పురస్కారం స్వీకరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి


పెందుర్తి: సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్ పురం) పంచాయతీకి జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అమలు చేస్తున్న విధానం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాల్లో జిల్లా అధికారుల ప్రతిపాదన మేరకు ఎస్ఆర్‌పురం పంచాయతీని ఎంపిక చేశారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ నుంచి సర్పంచ్ దూది విజయలక్ష్మి, వెంకటరమణ దంపతులు పురస్కారం అందుకున్నారు.

నేడు ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు సోమవారం జరగనుంది. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.జ్ఞానవేణి తెలిపారు. బీచ్ రిసార్టులు, అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024–29 పర్యాటక పాలసీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాలో టూరిజం శాఖకు సంబంధించి 15 ల్యాండ్ పాకెట్స్ ఉన్నాయని.. టర్నోవర్‌ను బట్టి ఆసక్తి గల సంస్థలకు భూ కేటాయింపులు జరుగుతాయని.. ఈ అంశంపైనా సదస్సులో చర్చించనున్నామన్నారు. దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యం కానున్న ఈ సదస్సును పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించనున్నారని తెలిపారు. సమ్మిట్‌కు ఏపీటీడీసీ చైర్మన్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులు హాజరుకానున్నారని వెల్లడించారు.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్ల పరిశీలన

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లను తిరుపతి ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఎ.నిర్మల్ కుమార్ ప్రియ ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన కాలేజీని సందర్శించి ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, ఇతర సిబ్బందితో చర్చించారు. పోటీల్లో తలపడాల్సిన టీమ్‌లకు సంబంధించి లాటరీని తీసి ప్రకటించారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించి ట్రాక్ అండ్ ఫీల్డ్‌ల మార్కింగ్‌లపై పలు సూచనలు చేశారు. స్టేజీ ఏర్పాట్లతోపాటు క్రీడాకారుల వసతి కల్పనకు ఎంపిక చేసిన భవనాలు, వాటి గదుల్లోని సౌకర్యాలను పరిశీలించారు. డిప్యూటీ సెక్రటరీ కె.లక్ష్మిపతి, గేమ్స్ అండ్ స్పోర్ట్సు మీట్ కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు, కో–కన్వీనర్ డాక్టర్ బి.జానకీరామ్, హెచ్‌ఓడీలు కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, డాక్టర్ రత్నకుమార్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ

446 మందికి ప్రతిభా పురస్కారాలు

ఉత్తమ సేవలందించిన అధికారులకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఐఏఎస్ అధికారులు కె.ఎస్.విశ్వనాథన్, కె.మయూర్ అశోక్, ఇమ్మడి పృథ్వీతేజ్, డిప్యూటీ కలెక్టర్లు కె.సంగీత్ మాథుర్, సుధాసాగర్, డీఎస్ సునీత, జె.మాధవి కలెక్టర్ నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన మొత్తం 446 మంది అధికారులు, సిబ్బందికి పురస్కారాలు ప్రదానం చేశారు.



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు స్వీకరిస్తున్న విశ్వనాథన్ వీఎంఆర్డీఏ కమిషనర్, పృథ్వీతేజ్ ఈపీడీసీఎల్ సీఎండీ, కె.మయూర్ అశోక్ జేసీ, భవానీ శంకర్ డీఆర్వో, యాసిన్ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జి.శ్యామ్ బాబు ఈపీడీసీఎల్ ఎస్ఈ, ఎం.శ్రీలత సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్, ఆర్.పూర్ణిమాదేవి డ్వామా పీడీ, సిహెచ్ సుబ్బిరెడ్డి జిల్లా ఉపాధి కల్పనాధికారి, ఎన్.ప్రేమకుమార్ డీఈవో, పి.లక్ష్మణరావు మత్స్యశాఖ జేడీ, జి.శ్రీనివాసరావు జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ (కుడి నుంచి ఎడమ)



ఎస్.వి.రమణ ఐఆర్‌పీఆర్ డీడీ, పి.శివానంద్ కేజీహెచ్ సూపరింటెండెంట్, హరికృష్ణ ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్, కె.రాంబాబు విమ్స్ డైరెక్టర్, కె.అప్పారావు ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్, ఎస్.ఎస్.వర్మ జీవీఎంసీ అడిషనల్ కమిషనర్, నరేష్ జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి, పి.వి.ముకుందరావు పర్యావరణ ఇంజినీర్, ఆర్.ప్రసాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, జి.బాలకృష్ణ స్టాంపులు రిజిస్ట్రేషన్లు డీఐజీ, కె.రామారావు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, కె.రమేష్ వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్, పి.నారాయణ మూర్తి జిల్లా పరిషత్ సీఈవో, ఎం.మహేష్ బాబు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్, జ్ఞానవేణి జిల్లా పర్యాటక అధికారి



కె.సంగీత మాథూర్ భీమిలి ఆర్డీవో, సుధా సాగర్ హెచ్‌పీసీఎల్, డి.ఎస్.సునీత స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారి, జె.మాధవి జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి, బి.మురళీమోహనరావు దేవదాయ శాఖ ఈవో, సిహెచ్ వెంకటరమణ కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఈ, శ్రీనివాసరాజు సింహాచలం దేవస్థానం ఈఈ, కాండ్రేగుల జగదీశ్వరరావు పబ్లిక్ ప్రాసిక్యూటర్, నవీన్‌రాజా సర్క్యూట్ హౌస్ పర్యవేక్షకుడు, పి.సుధీర్ బాబు డీటీ, నగేష్ పట్నాయక్ మలేరియా సబ్ యూనిట్ అధికారి, రాజేంద్ర కుమార్ ఇరిగేషన్ డీఈఈ, సురేష్ యాదవ్, వంశీ రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్లు, సిహెచ్ మల్లికార్జునరావు, సమాచార ఇంజినీర్



వి.ఎస్. శేఖర్ ఇంటలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్, వరుణ్ రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్, షేక్ ఖాదర్ బాబా సీతమ్మధార వీఆర్వో, తులసీ జిల్లా మలేరియా అధికారి, నరసింహమూర్తి ద్వారకా ఏసీపీ, కె.రామకృష్ణరాజు 108 పైలెట్, కొండలరావు ఈఎంటీ 108, గణేష్ ఈఎంటీ 108

కలెక్టరేట్‌లో..



మహారాణిపేట: కలెక్టరేట్ వద్ద జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలోని పార్కు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..



విశాఖ లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లు, సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో వాల్తేర్ డివిజన్



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న రైల్వే డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది అకుంఠిత దీక్ష, సమష్టి కృషితో వృద్ధి దిశగా పయనిస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ అన్నారు. గతేడాది కంటే లోడింగ్, ఆదాయార్జనలో ఈ సంవత్సరం మెరుగైన ప్రగతి నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైల్వే భద్రతా దళం, సివిల్ డిఫెన్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు బహూకరించారు. అనంతరం ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రదర్శించిన బైక్ విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/కన్‌స్ట్రక్షన్ అంకుష్ గుప్తా, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) ఈ శాంతారం, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారి పాల్గొన్నారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ, ఇతర సభ్యులతో కలిసి డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో రోగులకు హెల్త్ డ్రింక్స్ అందజేశారు.



మోటార్ బైక్‌పై విన్యాసాలు చేస్తున్న ఆర్పీఎఫ్ జవాన్లు

విశాఖ అభివృద్ధికి కృషి



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సీతంపేట: మౌలిక వసతులు కల్పించడం ద్వారా పోర్టు అభివృద్ధితో పాటు విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ మెట్రిక్ టన్నుల రవాణా లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు మనుగడలో ఉన్నాయన్నారు. అనంతరం ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

అందరికీ గణతంత్ర ఫలాలు

దాబాగార్డెన్స్: దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ ఫలాలు అందాలని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల మహాత్మా గాంధీ విగ్రహానికి, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మహాత్మా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో కలిసి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జీవీఎంసీ ప్రగతి నివేదికను అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి వినిపించారు. కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్ జైన్, అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సెల్యూట్ చేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ హరేందిర ప్రసాద్, మేయర్ హరివెంకటకుమారి

అభివృద్ధి పథంలో హెచ్‌పీసీఎల్

సాక్షి, విశాఖపట్నం: పర్యావరణహిత ప్రాజెక్టులు, విస్తరణ పనులతో హెచ్‌పీసీఎల్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని సంస్థ విశాఖ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.రామకృష్ణన్ అన్నారు. రిఫైనరీలో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవంలో ఈడీ రామకృష్ణన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ జవాన్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణన్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హెచ్‌పీసీఎల్‌లో 15 నుంచి 40 ఏళ్ల వరకూ విధులు నిర్వరిస్తూ సేవలందిస్తున్న అధికారులు, ఉద్యోగులకు సర్వీస్ సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీజీఎం ఈడీవీఆర్ అభిషేక్ త్రివేది, హెచ్‌ఆర్ సీజీఎం కిరణ్‌కుమార్‌తో పాటు హెచ్‌పీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

సీతమ్మధార: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) పరిధిలోని 11 సర్కిళ్లలోని సుమారు 76 లక్షల వినియోగదారులకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిరంతరాయంగా విద్యుత్ సేవలందిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. వ్యవసాయ రంగానికి 9 గంటల త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం ద్వారా 3.35లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 4,500 సర్వీసులకు 16 మెగావాట్ల సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ల ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 120 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డైరెక్టర్లు డి.చంద్రం, వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వి.రామకృష్ణప్రసాద్, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సీజీఎంలు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్

ఆహ్లాదకరంగా హైటీ

మహారాణిపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం కలెక్టర్ బంగ్లాలో హై–టీ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్, జేసీ మయూర్ అశోక్, జీసీసీ ఎండీ కల్పనా కుమారి, డీసీపీ–1 వి.అజిత, డీసీపీ–2 మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

'గణతంత్ర స్ఫూర్తితో చట్టాలను రక్షించుకుందాం'



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

సీతమ్మధార: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లౌకిక, ప్రజాస్వామ్య హక్కులను హరించడంతో పాటు కార్మిక, రైతు చట్టాలకు తూట్లు పొడుస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నరసింగరావు, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో కార్మిక, రైతు చట్టాలను, రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన జరిగింది. అక్కడి నుంచి కార్మిక సంఘాల నాయకులు ఆశీలమెట్ట వరకు ప్రదర్శనగా వెళ్లి తిరిగి గాంధీ పార్కుకు చేరుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. దేశంలో 65 శాతం రైతాంగం ఉన్నా.. వారి పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. అదే సమయంలో కార్మిక హక్కులను కాలరాసే విధంగా కార్మిక చట్టాలను సవరించి, 4 లేబర్ కోడ్లుగా తెచ్చి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. కార్మిక లేబర్ కోడ్లను రద్దు చేయాలని కార్మిక వర్గం పోరాడుతుంటే, వాటిని ఎలాగైనా అమలు చేస్తామని మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. నాలుగేళ్లుగా విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం, సొంత గనులు కేటాయించాలని ఉద్యమం జరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వం ఎలాగైనా ప్రైవేట్ వారికి కట్టబెట్టే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు శంకరరావు, దేవా, గణేష్ పాండా, పి.మణి, జి.అప్పలరాజు, ఒ.అప్పారావు, పి.వెంకటరావు, వి.నరేంద్రకుమార్, కె.ఎం.కుమార్ మంగళం, టి.నూకరాజు, అచ్యుతరావు, రెహ్మాన్, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

బీపీఎల్ చాంపియన్ వైజాగ్ వెలాసిటీ–3 జట్టు

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరానికి మార్గనిర్దేశం చేస్తూ వారిలోని శక్తియుక్తులను సరైన మార్గంలో వినియోగిస్తే అద్భుతాలను ఆవిష్కరించగలరని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేకేసీ కళాశాల మైదానంలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ (బీపీఎల్ 2024–25) ఉత్సాహంగా జరిగింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ హైలాండర్స్–2 జట్టుతో తలపడిన వైజాగ్ వెలాసిటీ–3 జట్టు విజేతగా నిలిచి భాష్యం ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ షిప్‌ను చేజిక్కించుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించామని చెప్పారు. మొత్తం 720 మ్యాచ్‌ల్లో బ్రాంచ్ స్థాయిలో 420, జోనల్ స్థాయిలో 281, సెంట్రల్ స్థాయిలో 19 మ్యాచ్‌లు జరిగాయని తెలిపారు. అనంతరం వైజాగ్ వెలాసిటీ–3 జట్టుకు ప్రీమియర్ లీగ్ ఛాంపియన్స్ ట్రోఫీని భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ అందజేశారు.



వైజాగ్ వెలాసిటీ–3 జట్టుకు చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

ఉత్తమ కమాండర్‌గా ఢిల్లీశ్వరి

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ ఎం.ఢిల్లీశ్వరి డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా బెస్ట్ కాంటిన్‌జెంట్ కమాండర్ అవార్డు అందుకుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన పరేడ్‌లో బుల్లయ్య కళాశాలకు చెందిన 14 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. పరేడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన ఢిల్లీశ్వరి అవార్డుకు ఎంపికైంది.



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న ఢిల్లీశ్వరి

నగరానికి చేరుకున్న మంత్రి లోకేష్

మహారాణిపేట: రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదివారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా రాంనగర్‌లోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. రాత్రి అక్కడ బస చేశారు. సోమవారం ఉదయం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని.. సాయంత్రం విమానంలో విజయవాడ వెళ్తారు.

చికిత్స పొందుతూ దీక్షిత మృతి

కావేరి ట్రావెల్స్ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోలేదని బంధువుల ఆవేదన



దీక్షిత(ఫైల్)

పెందుర్తి: రాజమండ్రిలో బుధవారం జరిగిన కావేరి ట్రావెల్స్ బస్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఈల్లా దీక్షిత(22) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సుజాతనగర్‌కు చెందిన దీక్షిత, మర్రిపాలెనికి చెందిన ఆమె బంధువు కల్యాణి ఇంటర్వ్యూ నిమిత్తం విశాఖ నుంచి హైదరాబాద్‌కు కావేరి ట్రావెల్స్ బస్‌లో ఈ నెల 22న బయలుదేరారు. రాజమండ్రి వద్దకు వెళ్లేసరికి బస్ బోల్తా పడడంతో కల్యాణి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో గాయపడిన దీక్షితను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన దీక్షిత కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో కూరుకుపోయారు. మరోవైపు ప్రమాదం జరిగి నాలుగు రోజులైనా కావేరి ట్రావెల్స్ యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ కనీసం స్పందించకపోవడం పట్ల బంధువులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

చికిత్స పొందుతూ మరో చిన్నారి మృతి



ఇషిత(ఫైల్)

తగరపువలస: ఇద్దరు బిడ్డలకు విషమిచ్చి తల్లి కూడా విషం తీసుకున్న ఘటనలో.. పెద్ద కుమార్తె ఇషిత(5) నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆదర్శనగర్‌కు చెందిన దివీస్ ఉద్యోగి మహంతి రామకృష్ణతో మనస్పర్థల కారణంగా తల్లి మాధవి(25) గత శుక్రవారం తాను విషం తీసుకోవడంతోపాటు ఇద్దరు కుమార్తెలు ఇషిత, రితిక్ష(18 నెలలు)లకు విషం ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే రోజు సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో మాధవి, శనివారం నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో రితిక్ష మృతి చెందారు. ఆదివారం పెద్ద కుమార్తె ఇషిత కూడా మృతి చెందినట్టు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు.